క్లుప్తంగా...

ఆహార ప్యాకెట్లు అందజేత



ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న డాక్టర్ రవీందర్‌గౌడ్

సనత్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను వరదల్లో వదిలేసిందని కాంగ్రెస్ పార్టీ సనత్ నగర్ నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. వరదలతో ముంపుబారిన పడ్డ బేగంపేట వడ్డెరబస్తీలో బుధవారం ఆయన పర్యటించి ఆహార ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు వచ్చినప్పుడల్లా భ యంభయంగా గడపాల్సి వస్తోందని ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని పలువురు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. డీసీసీ జనరల్ సెక్రటరీ తోట మణిమాల, రమేష్, కమల్‌రాజ్, ప్రవీణ్‌కుమార్, కనకరాజు, మల్లేష్ పాల్గొన్నారు.

డీఎస్‌ఎస్ బలోపేతానికి కృషి



లాలాపేట: దళిత సంఘర్షణ సమితి(డీఎస్‌ఎస్) సికింద్రాబాద్ నియోజకవర్గం సెక్రటరీగా తార్నాక డివిజన్ లాలాపేట వినోభానగర్‌కు చెందిన అశోక్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం దీనికి సంబంధించిన నియామకపు పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అందజేశారు. అశోక్‌బాబు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం జాతీయ స్థాయిలో కృషి చేస్తున్న డీఎస్‌ఎస్‌ను నియోజకవర్గంలో బలోపేతం చేస్తామన్నారు. పూలే, అంబేడ్కర్, కాన్షీరాం మహనీయుల ఆశయ సాధనకు పాటు పడతానన్నారు.

స్థానిక బీసీ నాయకులకే టికెట్ ఇవ్వాలి

రాంగోపాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ టికెట్టు స్థానికులతో పాటు బీసీ వర్గాలకు చెందిన వారికే కేటాయించాలని నియోజకవర్గ సీనియర్ నాయకులు గంటా సుధీర్ కుమార్ కోరారు. నియోజకవర్గంలో కొన్ని దశాబ్దాల నుంచి తాము కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, కార్యకర్తల కోసం పనిచేస్తున్నామన్నారు. ఇటీవల కొంతమంది నాయకురాళ్లు వచ్చి తమకే టికెట్ అంటూ ప్రచారం చేస్తూ కార్యకర్తలు, నాయకులను అయోమయానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను నియోజకవర్గంలో బీసీ మున్నూరు కాపులకు చెందిన 47 వేల ఓటర్లు ఉన్నారని ఇవన్నీ ఆలోచించి అధిష్ఠానం టికెట్ కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అంటే ప్యారాషూట్ పార్టీ అనే అపవాదు ఉందని దాన్ని కొనసాగింపుగా ఆంధ్రా నుంచి వచ్చిన వాళ్లకు టికెట్లు కేటాయిస్తే పార్టీ అధోగతి పాలవుతుందని ఆరోపించారు.

గాంధీ ఎంసీహెచ్‌లో ఓపీ సేవలు షురూ

గాంధీ ఆస్పత్రి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తాధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలో సుమారు రూ.60 కోట్లతో నిర్మించిన మదర్ అండ్ చైల్డ్ హెల్త్ కేర్ (ఎంసీహెచ్) 200 పడకల సూపర్ స్పెషాలిటీ సెంటర్‌లో గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో అవుట్ పేషెంట్ సేవలు ప్రారంభమయ్యాయి. గత నెల 20న వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించగా, చిన్నపాటి సమస్యలను పరిష్కరించి, సకల సదుపాయాలు, వసతులతో ఎంసీహెచ్ సేవలను బాలింతలు, గర్భిణులకు అందుబాటులోకి తెచ్చినట్లు గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు తెలిపారు. ఓపీ విభాగంలో కంప్యూటర్ చిట్టీల క్యూలైన్లు ఏర్పాటు చేశామని, ఆధార్ కార్డు తప్పరిసరిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు. గైనకాలజీ విభాగ వైద్యులు ప్రతిరోజు సుమారు 350 నుంచి 400 మందికి వైద్యసేవలు అందిస్తున్నామని, అర్హులైనవారు గాంధీ ఎంసీహెచ్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఎంసీహెచ్ విభాగంలో త్వరలోనే ఇన్ పేషెంట్ సేవలు ప్రారంభిస్తామన్నారు.

'గాంధీ'లో మరిన్ని సౌకర్యాలకు ప్రణాళికలు

సూపరింటెండెంట్ రాజారావు



జనరల్ మెడిసిన్ ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న రాజారావు

గాంధీఆస్పత్రి : తెలంగాణ వైద్యప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో మరిన్ని మౌలిక వసతులు, సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయనున్నట్లు గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు స్పష్టం చేశారు. గైనకాలజీ ఓపీ విభాగం ఎంసీహెచ్‌కు తరలిపోవడంతో ఆ స్థానంలో జనరల్ సర్జరీ, పల్మనాలజీ, రెస్పరేటరీ మెడిసిన్ ఓపీ విభాగాలు, టీబీ క్లినిక్, మలేరియా నమూనాల సేకరణ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రాజారావు మాట్లాడుతూ.. ఓపీ విభాగంలో రోగుల ఆన్‌లైన్ డేటా నమోదు కార్యక్రమం జరుగుతుందని, ప్రతిఒక్కరు ఆధార్ కార్డు తెచ్చుకోవాలని సూచించారు. రోగుల రద్దీకి అనుగుణంగా ఓపీ కౌంటర్ల సంఖ్య పెంచామన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ సర్జరీ విభాగాధిపతి ఎస్‌వీఎస్ రెడ్డి, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీ సుబోధ్‌కుమార్, ఆర్‌ఎంఓ-1 జయకృష్ణ, పలువురు వైద్యులు, ఆర్‌ఎంఓ, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పైప్‌లైన్ నిర్మాణానికి రూ. 94 లక్షలు మంజూరు..
గాంధీ అత్యవసర విభాగం వెనుక నూతనంగా నిర్మించిన డైట్ క్యాంటీన్ భవనానికి మంచినీరు సరఫరా చేసేందుకు అవసరమైన పైప్‌లైన్ నిర్మాణానికి రూ. 94 లక్షలు మంజూరు అయ్యావని, త్వరలో పనులు పనులు ప్రారంభం అవుతాయన్నారు. సెల్లార్‌లో కొనసాగుతున్న డైట్ క్యాంటీన్‌ను మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం తర్వాత నూతన భవనంలోకి తరలిస్తామన్నారు.

◆ నూతనంగా నిర్మించిన ఎంసీహెచ్ భవనంతో ఓపీ, అత్యవసర విభాగాలను అనుసంధానం చేసేందుకు రూ.33 లక్షల వ్యయంతో కనెక్టింగ్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నామని రాజారావు వివరించారు. నెలరోజుల్లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి తెస్తామని తెలంగాణ వైద్య విద్యా మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఇంజినీర్లు తెలిపారు.

'బేగంపేట నాలా అభివృద్ధిలో అవినీతి'



స్థానికులతో మాట్లాడుతున్న కోట నీలిమా

సనత్‌నగర్: రూ.45 కోట్లతో నాలా అభివృద్ధి చేశామని చెప్పుకునే స్థానిక ఎమ్మెల్యే తలసానిశ్రీనివాస్‌యాదవ్ బేగంపేట బ్రాహ్మణవాడీ ముంపునకు సమాధానం చెప్పాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ డిమాండ్ చేశారు. బ్రాహ్మణవాడీ బస్తీలో పర్యటించి సహాయక చర్యల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి శాస్త్రీయ సర్వే గానీ, ముంపుపై అవగాహన లేకుండా నాలా అభివృద్ధి పనులు చేపట్టారని ఆరోపించారు. నాలా అభివృద్ధిలో అవినీతి చోటుచేసుకుందని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నాలాలో పూడికతీతలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారో ప్రజలకు తెలుపాలన్నారు.

మూడోరోజుకు చేరిన 'పెన్‌డౌన్'



తెలంగాణ మహిళా వర్సిటీలో ఆందోళన

నిలిచిపోయిన పాఠ్యాంశాల బోధన

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు 12 వర్సిటీలకు వ్యాపించినట్లు జేఏసీ నాయకులు సీమర్ల విజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అధ్యాపకులు చేపట్టిన పెన్‌డౌన్, చాక్‌డౌన్ ఆందోళన కార్యక్రమాలు బుధవారంతో మూడో రోజుకు చేరాయి. రాష్ట్రంలో గురుకుల కళాశాలతో పాటు ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నికల్ కాలేజీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేసి కేవలం వర్సిటీల అధ్యాపకులను పక్కన పెట్టడం దారుణమన్నారు. తెలంగాణ కోసం ఉద్యమించిన కాంట్రాక్టు అధ్యాపకుల కుటుంబాలను ఇబ్బంది పెట్టడం బాధాకరమన్నారు. వర్సిటీలలో 25 ఏళ్లుగా బోధించే అధ్యాపకులు పర్మనెంట్‌కు అర్హులు కాదా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ఉద్యోగాలను పర్మనెంట్ చేస్తామని రెండు సార్లు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఇదిలా ఉండగా కాంట్రాక్టు అధ్యాపకుల ఆందోళన కారణంగా ఆయా వర్సిటీల పరిధిలోని కాలేజీల్లో పాఠ్యాంశాల బోధన నిలిచిపోయింది.

అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి వితరణ



అంగన్‌వాడీ చిన్నారులతో మర్రి ఆదిత్యరెడ్డి

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రానికి టీపీసీసీ సభ్యులు మర్రి ఆదిత్యరెడ్డి కుర్చీలు, బల్లలు, లంచ్‌బాక్స్‌లను అందజేశారు. ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితులు చూసిన అనంతరం కావాల్సిన సౌకర్యాలు, సదుపాయాలు కల్పిస్తానంటూ ఇచ్చిన హామీ మేరకు కావాల్సిన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనత్‌నగర్ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విఠల్, రమణ, శైలేష్, శివలాల్, రాము, సురేష్, క్రిష్ణ, హేమలత, సత్యనారాయణ పాల్గొన్నారు.

కరాటేలో సత్తా

అమీర్‌పేట: కేశవ్ గార్డెన్స్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని నాయక్ బుడోకాన్ కరాటే అకాడమీ విద్యాంజలి విద్యార్థులు సత్తా చాటారు. కటా, కుమ్టె ఈవెంట్స్‌లో శ్రీజన్ హంస 2 బంగారు, సాకేత్ శర్మ బంగారు, కాంస్యం, ఇషాన్ రాజ్‌పురోహిత్ కాంస్యం, రజత పతకాలు సాధించారు. వ్యక్తిగత విభాగంలో ఎం. సాహితీ రజత పతకం, జీకే చతుర్వ వేద కాంస్య పతకం సాధించినట్లు కరాటే మాస్టర్ వాసుదేవ్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అభినందించారు.



సాధించిన పతకాలతో విద్యార్థులు

రెయిన్ కోట్ల అందజేత

లాలాపేట: నగరాన్ని క్లీన్‌సిటీగా మార్చేందుకు స్వచ్ఛ కార్మికులు కృషి చేయాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో హైదరాబాద్ నగరానికి ప్రథమస్థానంలో నిలుపాలన్నారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, కార్మికులకు బుధవారం ఆమె తన కార్యాలయంలో రెయిన్ కోట్లు పంపిణీ చేసి మాట్లాడారు. కేటాయించిన ప్రాంతంలో క్రమం తప్పకుండా ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలన్నారు. ఆటో డ్రైవర్ల ఆరోగ్య రక్షణకు గ్లౌజ్‌లు, హెల్త్ కార్డులు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.

అడ్డగుట్ట: విధి నిర్వహణతో పాటు వ్యక్తిగత రక్షణ కూడా ఎంతో అవసరమని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె శానిటేషన్ సిబ్బందికి రెయిన్ కోట్లు పంపిణీ చేసి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచడంలో శానిటేషన్ సిబ్బంది చేసే సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించండి

● సీఈవో మధుకర్‌నాయక్

రసూల్‌పురా: వర్షాకాలంలో ముంపునకు గురవుతున్న మూడో వార్డు విమాననగర్ కాలనీ, ప్యాట్నీనగర్, రెండో వార్డు బీహెచ్‌ఈఎల్ కాలనీ ప్రాంతాల్లో కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ బుధవారం పర్యటించారు. బాలంరాయి నుంచి ప్యాట్నీ కాంపౌండ్ వరకు నాలా వెంట వెలిసిన అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. నాలా వెంట ఉన్న పలు అక్రమ నిర్మాణాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బీఎన్. శ్రీనివాస్ సీఈవోను కోరారు. ప్యాట్నీ నగర్‌లో హోండా టూ వీలర్ సర్వీస్ సెంటర్, టైల్స్ గోదాం తదితర అక్రమ నిర్మాణాలను తొలగించాలని సీఈవో మధుకర్ నాయక్ బోర్డు అధికారులను ఆదేశించారు. శానిటేషన్ సూపరింటెండెంట్ దేవేందర్, చీఫ్ ఇంజనీర్ గోపాల కృష్ణదాస్, దఫేదార్ రామకృష్ణ, సూరి, విమాన్‌నగర్ కాలనీ అధ్యక్షుడు రాజేషం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చౌహాన్, నాయకులు ముప్పిడి గోపాల్ ఉన్నారు.

ఎమ్మెల్యే టికెట్లకు విద్యార్థి నేతల దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ కోసం కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓయూ విద్యార్థి నేతలు దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని నాటి నుంచి పార్టీలలో పని చేస్తున్న సుమారు 50 మందికి పైగా విద్యార్థి నాయకులు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని వినతి పత్రాలు సమర్పించారు. పోటీ చేసే అవకాశం లభిస్తుందో లేదోనని విద్యార్థి నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది.

ఈవీఎం, వీవీప్యాట్‌పై అవగాహన

లాలాపేట: లాలాపేటలో బుధవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ వీవీ ప్యాట్‌తో సంచార ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవీఎం ద్వారా ఓటేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సంరద్భంగా స్థానికులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. స్థానిక ఎన్నికల అధికారి, ఏఈ వెంకటేష్, సిబ్బంది, ఆయా పార్టీల నేతలు సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, ప్రవీణ్‌లాల్, ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు.

30 నుంచి సమస్యల పరిష్కారానికి పాదయాత్ర

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సనత్‌నగర్: క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఈ నెల 30వ తేదీ నుంచి సనత్‌నగర్ నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నేతలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రతి శని, ఆదివారాల్లో నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకుంటామన్నారు. ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా అమలుచేస్తున్న బీసీ, దళిత బంధు, గృహలక్ష్మి పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని ఆదేశించారు. పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చాలనే సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ లను పంపిణీ చేస్తున్నామన్నారు. మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గ పరిధిలో 500 మంది చొప్పున 11700 మందికి ఇళ్లను పంపిణీ చేశామన్నారు. రెండో విడత లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల కేటాయింపు ప్రక్రియను కూడా వారం రోజుల్లో జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారందరికీ దశలవారీగా ఇళ్లను కేటాయిస్తామన్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో చిరునామా మార్పులు చేర్పులు పోలింగ్ బూత్‌ల మార్పులకు సంబంధించి ఈ నెల 19 వరకు గడువు ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు మహేశ్వరిశ్రీహరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, అరుణగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పవన్‌కుమార్‌గౌడ్, వెంకటేష్ రాజు, హన్మంతరావు, అశోక్‌యాదవ్, శ్రీహరి, శేఖర్, సంతోష్, మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, నాగులు, రాములు పాల్గొన్నారు.

'పూడికతీతలో అధికారుల నిర్లక్ష్యం'



స్థానికులతో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: నాలాల పూడికతీత విషయంలో అధికారుల వైఫల్యం అడుగడుగునా కనిపిస్తోందని బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి విమర్శించారు. ముంపునకు గురైన బేగంపేట డివిజన్ బ్రాహ్మణవాడీ లేన్ నెంబర్లు 2, 3, 4,7లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంతో పోల్చితే ఈ ప్రాంతాల్లో ముంపు తీవ్రత ఏమాత్రం తగ్గలేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు ఎత్తు పెంచుతూ జరిపిన నిర్మాణాలతో వరద తీవ్రత మరింత పెరిగిందన్నారు. రోడ్డు ఎత్తుకు సంబంధించి ఎవరైనా ప్రస్తావిస్తే వారిని బెదిరింపులకు పాల్పడుతున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. నాలా డీసిల్టింగ్ పనులు జరిగే సమయంలో తొలగించిన మట్టిని బయటకు తరలించకుండా రిటైనింగ్ గోడల వద్దకు చేర్చి వదిలేశారని దీంతో వరద నీటి ఉధృతికి మళ్లీ నాలాలోనే మట్టి చేరుతుండడంతో సమస్య మొదటికొస్తోందన్నారు. ఆయన వెంట నెమలి ఆనంద్, షేక్‌గౌస్, అరుణ్, సురేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, సంతోష్, ఆనంద్, పాండ్యన్, శ్రావణ్ ఉన్నారు.

ఐఆర్‌సీఎస్ యూత్ కన్వీనర్‌గా మణిదీప్



నియామకపత్రం అందుకుంటున్న మణిదీప్

సనత్‌నగర్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) హైదరాబాద్ జిల్లా యూత్ కన్వీనర్‌గా బేగంపేట కుందన్‌బాగ్ అపార్ట్‌మెంట్స్‌కు చెందిన మణిదీప్ నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రీతిపటేల్, హైదరాబాద్ జిల్లా చైర్మన్ మామిడి భీంరెడ్డి బుధవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో రక్తాన్ని అందించడంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. సంస్థ చేపడుతున్న సామాజిక బాధ్యతల్లో తనను భాగస్వామ్యం చేస్తూ యూత్ కన్వీనర్‌గా నియమించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కర్తవ్య దీక్షతో బాధ్యతలు నిర్వర్తిస్తూ అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని అందించి బాధితుల ప్రాణాలను కాపాడడంలో తన వంతు కృషి చేస్తానన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని బీదలబస్తీ ఎల్లమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. స్థానిక కార్పొరేటర్ సామల హేమ బుధవారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పునఃనిర్మాణ పనులు చేపట్టిన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గడ్డం ప్రసాద్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తు పత్రాల అందజేత..
అర్హులైన వారందరూ గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేటర్ హేమ సూచించారు. సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముషీరాబాద్ ఎమ్మార్వోకు దరఖాస్తు ఫారాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అర్హులైన వారు పత్రాలతో వచ్చి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పనుల పరిశీలన..
నాగాలగుండులో జరుగుతున్న వార్డు కార్యాలయ నిర్మాణ పనులను హేమ పరిశీలించారు. వీలైనంత తొందరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సుమారు రూ. 2 కోట్ల వ్యయంతో చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం శానిటేషన్ సిబ్బందికి రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ వెంట జీహెచ్‌ఎంసీ అధికారులు డీఈఈ సువర్ణ, ఏఈ కౌశిక్ ఉన్నారు.

ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



లోగో ప్రాస్పెక్టస్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, అంకితభావంతో ముందుకు వెళ్లాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. బుధవారం సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లో సెయింట్ మేరీస్ సెంటినరీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఎంబీఏ) కాలేజ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు నాణ్యమైన, విలువలతో కూడిన సంపూర్ణమైన అభివృద్ధి కనిపిస్తుందని దానికి సృజనాత్మకత మరింత జోడించాలన్నారు. హైదరాబాద్ ఫార్మాకామర్స్ ఎయిర్ ఫోర్స్, ఎయిర్ లైన్స్, హోటల్ మేనేజ్‌మెంట్ తదితర రంగాల్లో అత్యధిక ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా లోగో ప్రాస్పెక్టస్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్చిబిషప్, కార్డినల్ పూల ఆంథోనీ, వైస్ చైర్మన్ రెవరెండ్ ఫాదర్ బాల శౌరి, డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఆంథోని వినయ్, ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మినారాయణ, ఓయూ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ శ్రీరాములు, ఓయూ అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ శ్రీనాగేష్, తులసీరామ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు



క్రిష్ణా-రాధా వేషధారణలో చిన్నారులు

చిలకలగూడ: నామాలగుండు అమరావతి టాలెంట్ పాఠశాల ప్రాంగణంలో కృష్ణాష్టమి వేడుకలను బుధవారం సందడిగా నిర్వహించారు. పలువురు చిన్నారులు కృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలో ఆటపాటలతో అలరించారు. కృష్ణభగవానుడి జన్మ వృత్తాంతంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేషధారణ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించి, మిఠాయిలు పంచిపెట్టారు.

భోలక్‌పూర్‌లో..
పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్‌లో బుధవారం క్రిష్ణా జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో చిన్నారులు క్రిష్ణ భగవాన్ వేషధారణలతో అలరించారు. విద్యార్థుల సందడితో పాఠశాల ఆవరణ కోలాహలంగా మారింది. మంచాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే తమ సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు.

సంజనా ప్లే స్కూల్‌లో..
రాంగోపాల్‌పేట్: మోండా మార్కెట్ డివిజన్‌లోని సంజనా ప్లే స్కూల్‌లో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేస్తూ నృత్యాలతో అలరించారు.

టీవోలి గార్డెన్‌లో..
రసూల్‌పురా: సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ టీవోలి గార్డెన్‌లో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రొ. శ్రీరామ్ ముఖ్య అతిథిగా హాజరై ట్రస్టీ రాజ్ కందుకూరితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ.. ప్రతి అంశాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే అంతా బృంధావనమే అని ప్రతి మానవుడిలో నిగూఢమైన అనంత శక్తి దాగి ఉందన్నారు. అనంతరం మల్లాది సోదరులు స్వరపరచిన శ్రీ కృష్ణ లీలా తరంగిణి పుస్తకాన్ని ఆవిష్కరించారు.



ప్రొ. శ్రీరామ్‌కు పురస్కారం అందజేస్తున్న దృశ్యం





కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు



కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ కమిటీ మెంబర్‌గా ఇటీవల నూతనంగా నియమితులైన టీపీసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎల్ శ్రీనివాసులు గౌడ్ బుధవారం ఈ పార్టీ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏఐసీసీ ఎన్నికల కమిటీ సభ్యులుగా నియమితులైన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. -లాలాపేట

లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టండి



వరద నీటి తొలగింపు పనులు పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్

సనత్‌నగర్: లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు వరదనీటిని తొలగించే పనులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ జోనల్ పరిధిలోని బేగంపేట మయూరిమార్గ్, అల్లంతోటబావి, ద్వారకాదాస్ కాలనీ, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ఎస్పీరోడ్డు పెట్రోల్ పంప్ ప్రాంతాలను బుధవారం ఆయన సందర్శించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. వరదనీరు త్వరితగతిన బస్తీల నుంచి బయటకు వెళ్లేలా మ్యాన్‌హోళ్లకు అడ్డు పడుతున్న చెత్తను తొలగించాలని సూచించారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీరు ఇంకా తొలగించని పక్షంలో వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కమిషనర్ వెంట సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.